01ATP08F_01ATP08F.qxd 08-02-2026 PM 11:12 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

సోమవారం 09 ఫిబ్రవరి 2026 | పేజీలు : 04

పెనుకొండ సమీపంలో జాతీయ రహదారిలో ఘోర రోడ్డు ప్రమాదం

ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు | రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ | క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రి సవిత

తప్పిన పెనుప్రమాదం
- 9 మందికి తీవ్ర గాయాలు
- గాయపడ్డ వారిని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు
- క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి సవిత

పెనుకొండ ఫిబ్రవరి 8 (ప్రభాతవార్త)

పెనుకొండ సమీపంలోని గుట్టురు వద్ద జాతీయ రహదారిలో ఆదివారం ఉదయం 825కి హిందూపురం వైపు నుండి ధర్మవరం వెళుతున్న ఏపీఎస్ఆర్టీసీ బస్సు ఏపీ 02 టిఈ 3817 నంబర్ గల బస్సును అనంతపురం వైపు నుండి బెంగళూరు వైపు వేగంగా వెళుతున్న కే ఏ01 ఏ ఆర్ 5388 నంబర్ గల లారీ ఢీకొనడంతో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ రోడ్డు ప్రమాదంలో 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వీరందరినీ కియా పోలీసులు హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వీరుల ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం చికిత్స కోసం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ రోడ్డు ప్రమాదంపై కియా పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాజేష్ అందించిన సమాచారం మేరకు బస్సు చోదకుడు (డ్రైవర్) ఎస్. వెంకటరమణ నాయక్ అశ్రద్ధగా, నిర్లక్ష్యంగా డ్రైవ్ చేయడం వల్ల ప్రమాదం సంభవించిందని, బస్సు గుట్టూరు క్రాస్‌కు చేరుకొని ఎన్ హెచ్ 44 రహదారిపైకి ప్రవేశించింది. అదే సమయంలో, అనంతపురం నుంచి బెంగళూరు వెళ్తున్న లారీ నంబర్: కే ఏ01 ఏ ఆర్ 5388 ఎడమవైపు చివరలో ఢీకొనడంతో బస్సు ముందు ఎడమ భాగం డ్యామేజ్ అయ్యింది. ఈ డ్యామేజ్ వల్ల బస్సులోపల ఉన్న ప్రయాణికులు, బస్సు డ్రైవర్ వెంకటరమణ నాయక్ ,కండక్టర్ చాంద్ బాషా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో గాయపడిన 9 మందిని పెనుగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని. వీరిలో ముగ్గురిని మెరుగైన చికిత్స కోసం హిందూపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని తెలిపారు. రోడ్డుకు అడ్డుగా ఉన్న బస్సును క్రేన్ సహాయంతో పక్కకు జరిపి, ట్రాఫిక్ అంతరాయం కాకుండా చేసేమని ఎస్ఐ తెలిపారు. గాయపడ్డ వారిలో వెంకటరమణ నాయక్ బస్సు డ్రైవర్ (27) దూదేకుల చాంద్ బాషా, బస్ కండక్టర్ (31)బి.కల్పన(46) భాస్కర్ (32) చెన్నకేశవులు (32) జి సుజాత (35) ఎం. లక్ష్మమ్మ (55) చిన్న అంజనప్ప (64) వెంకటమ్మ (85)లు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత హుటా హుటిన ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని క్షతగాత్రులను పరామర్శించి మెరుగైన చికిత్స అందించాలని ప్రభుత్వ వైద్యులను మంత్రి సవిత ఆదేశించారు. ప్రమాదం జరిగిన వెంటనే గాయపడ్డ ప్రయాణికులను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన కియా పోలీసులను మంత్రి సవిత అభినందించారు.

భక్తజనసందోహం...హరిహరుల క్షేత్రం

శ్రీఅశ్వత్థనారాయణస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం,శ్రీచక్రభీమలింగేశ్వరస్వామికి పూజలు చేసిన దృశ్యం, స్వామివారి ఉత్సవ విగ్రహాలను అలంకరించిన దృశ్యం

తాడిపత్రిఅర్బన్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

పెద్దపప్పూరు మండలం చిన్నపప్పూరు సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన హరిహరులక్షేత్రం అశ్వత్థం మాఘమాసం మూడవ ఆదివారం భక్తజన సందోహంగా మారింది. జిల్లా నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చి శ్రీఅశ్వత్థనారాయణస్వామి, శ్రీచక్రభీమ లింగేశ్వర స్వామి వారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్నానఘట్టాలతో పాటు పెన్నానదిలో మాఘస్నానాలు ఆచరించి ఆలయం ఆవరణలో పొంగులు ఏర్పాటు చేసి స్వామివారికి నైవేద్యంతో పాటు బియ్యం, బ్యాల్లు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారిని దర్శించుకుంటే సంతానం లేని వారికి సంతానం లభిస్తుందని, తమ కష్టాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి ఆదేశాల మేరకు బారికేడ్లు, చలువపందిళ్లు, ప్రత్యేక తాగునీటి వసతి ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ ఇఒ సుబ్రమణ్యం, ఆలయ కమిటీ చైర్మన్ శివశంకర్‌రెడ్డి, సిబ్బంది గుర్రప్ప, అరుణ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీఅశ్వత్థ నారాయణస్వామి, శ్రీచక్రభీమ లింగేశ్వర స్వామికి ఉదయం అర్చకులు బాలసుబ్రమణ్యశర్మ అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తాడిపత్రి ఆర్టీసి డిపోవారు తిరుణాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపారు. పలువురు స్వచ్ఛంధ సంస్థలవారు భక్తులకు తాగునీరు, అన్నదాన కార్యక్రమాలను విరివిగా చేపట్టారు.

స్వామివారి దర్శనానికి వెళుతున్న భక్తులు

ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన గాజుల అంగళ్లు, దేవతామూర్తుల ఫోటోల అంగళ్లు, మిఠాయి దుకాణాలు, చెరుకు అంగళ్లు భక్తులతో కిక్కిరిసి పోయాయి. తిరుణాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా తాడిపత్రి రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అన్యాక్రాంతమైన యాడికి చెన్నకేశవస్వామి ఆలయం భూములను స్వాధీనం చేసుకుంటాం

- మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రిఅర్బన్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

యాడికిలోని పురాతన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన భూములు అన్యాక్రాంతమయ్యాయని వాటిని స్వాధీనం చేసుకుని ఆలయ దూపదీపనైవేద్యాలకు వినియోగిస్తామని తాడిపత్రి మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. తాడిపత్రి పట్టణంలోని జె.సి నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలయం నిర్మించినప్పుడు దాదాపు 1200 ఎకరాలు ఆలయానికి దేవుని మాన్యంగా వ్రాసిచ్చారని ఆ భూములు ప్రస్తుతం యాడికిలోని కొంతమంది అన్యాక్రాంతం చేసుకుని డబ్బులు చెల్లించకుండా వాడుకుంటున్నారని నా ప్రాణాలు పోయినా సరే ఆ భూములు స్వాధీనం చేసుకోవడానికి పోరాడుతానని పేర్కొన్నారు. ఆలయానికి సంబంధించిన రికార్డులు తనవద్ద వున్నాయని ఆ భూములు ఎవరు ఆక్రమించారో తనకు తెలుసన్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు జరిపేందుకు ప్రతి ఏడాది విరాళాలు సేకరిస్తున్నారని వందల ఎకరాల భూములు వున్నా భిక్షాందేహి అంటేనే బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయన్నారు. నా రాజకీయం సమాధి అయినా చెన్నకేశవస్వామి ఆలయం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. దాదాపు 1200 ఎకరాల భూముల్లో ఎకరానికి 2500 రూపాయలు చెల్లించినా దాదాపు 30 లక్షల రూపాయల ఆదాయం వస్తుందని ఆ ఆదాయంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుపుకోవచ్చన్నారు. తాడిపత్రి నియోజకవర్గంలోని అన్ని ప్రాచీన ఆలయాలను అభివృద్ధి చేయాలన్నదే తన అభిమతమన్నారు. సోమవారం యాడికిలో ఆలయం వద్దకు వచ్చి అక్రమ కట్టడాలను తొలగిస్తామని మీకు చేతనైతే అడ్డుకోవడానికి ప్రయత్నం చేయాలని సవాల్ విసిరారు. నేను రౌడీయిజం చేయడానికి రావడంలేదని నేను ఒక్కన్నే వస్తానని మీరు అడ్డుకుంటే నేను అక్కడే కూర్చుంటానన్నారు. భూములు ఆక్రమించిన వారిలో నా బంధువులు వున్నా వదిలే ప్రసక్తేలేదని ఆలయం అభివృద్ధి విషయంలో తన ప్రాణం పోయినా వెనక్కు తగ్గేదేలేదని ఆయన తెలియచేశారు.



మాట్లాడుతున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి

వైద్యం పేరిట వసూళ్ల పర్వం..!

- సెతస్కోపుతో గుండె చప్పుడు కాదు జేబు చప్పుడు వింటున్నారు
- కమీషన్ల కోసం అనవసర టెస్టులతో రోగిని కుంగదీస్తున్న వైనం
- వైద్యో నారాయణో హరి కాదు వైద్యో వసూల్ రాజా
- హిందూపురం ప్రైవేట్ ఆసుపత్రుల కాసుల కక్కుర్తి

హిందూపురం టౌన్ ఫిబ్రవరి 08 ప్రభాతవార్త

ఒకప్పుడు వైద్యో నారాయణో హరి అని డాక్టర్లను దైవంతో సమానంగా కొలిచేవారు. కానీ నేడు కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల పుణ్యమా అని ఆ నానుడి కాస్తా వైద్యో వసూల్ రాజాగా మారిపోయింది. తెల్ల కోటు వేసుకున్న కొందరు వైద్యులు సేవా భావాన్ని విస్మరించి, కాసుల వేటలో పడ్డారు. రోగి గుండె చప్పుడు వినాల్సిన స్టెతస్కోప్ ఇప్పుడు బాధితుడి జేబు చప్పుడు వింటోంది. రోగి పరిస్థితిని బట్టి ప్రాథమిక చికిత్స అందించడం పోయి, అవసరం ఉన్నా లేకపోయినా స్కానింగ్‌లు, అనవసరమైన రక్త పరీక్షల పేరుతో బిల్లులను అమాంతం పెంచేస్తున్నారు. రోగ నిర్ధారణ కంటే, రోగి ఆర్థిక స్థితిని అంచనా వేయడానికే ప్రాముఖ్యత ఇస్తున్నారు. ఔషధాల చీటీలపై ఉండే పేర్లు రోగి ఆరోగ్యం కోసం కంటే, డాక్టర్ జేబు నింపే ఫార్మా కంపెనీల కోసమే అన్నట్లుగా మారిపోయాయి. తెల్ల కోటు అంటే ఒక నమ్మకం, ఒక ధైర్యం. ఆ రంగు వెనుక ఉన్న స్వచ్ఛతను కాపాడుకోవాల్సిన బాధ్యత వైద్యులపై ఉంది. వైద్యం వ్యాపారం కాకూడదు, అది ప్రాణదానం కావాలి. హిందూపురంలో పుట్టగొడుగుల్లా వెలిసిన ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు ఒక సిండికేట్‌గా మారాయి. ఆసుపత్రికి వెళ్లిన రోగికి సాధారణ జ్వరం ఉన్నా సరే, వేల రూపాయల విలువ చేసే టెస్టులు రాయడం ఇక్కడ పరిపాటిగా మారింది. సదరు ల్యాబ్స్ నుంచి అందే భారీ కమీషన్ల కోసమే వైద్యులు అనవసరమైన పరీక్షలకు సిఫార్సు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోగి పరిస్థితి ఎలా ఉన్నా, ముందుగా డయాగ్నోస్టిక్ సెంటర్లకు పంపి వేలల్లో బిల్లులు చేయిస్తున్నారు. అవసరం లేకపోయినా సి.టి. స్కాన్, ఎం.ఆర్.ఐలతో సామాన్యుడి నడ్డి విరుస్తున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలోని ఫార్మసీల్లోనే మందులు కొనాలని నిబంధనలు పెట్టడం, అక్కడ కూడా భారీగా ఎం.ఆర్.పి ధరలకే విక్రయించడం గమనార్హం. చిన్న అనారోగ్యంతో వెళ్తే వేల రూపాయల టెస్టులు రాస్తున్నారు. రిపోర్టులు రాకముందే భయపెట్టి అడ్మిట్ చేసుకుంటున్నారు. చిన్నపాటి చికిత్సతో నయమయ్యే రోగాలకు కూడా అబ్జర్వేషన్ పేరుతో రోగిని అడ్మిట్ చేసుకుని గది అద్దె, ఇతర ఫీజుల పేరుతో బిల్లును తడిసి మోపెడు చేస్తున్నారు. డబ్బులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ, నాణ్యమైన వైద్యం అందించడంలో కనిపించడం లేదు. కొన్ని ఆసుపత్రుల్లో అర్హత లేని కాంపౌండర్లు, నర్సులతో వైద్యం చేయిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. హిందూపురం చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఇది వైద్య కేంద్రం. కానీ ఇప్పుడు ఇక్కడి కొన్ని ఆసుపత్రులు కార్పొరేట్ స్థాయిలో బిల్లులు వసూలు చేస్తున్నాయి. సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆసుపత్రి గడప తొక్కాలంటేనే వణికిపోయే పరిస్థితి నెలకొంది. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఆసుపత్రులపై, కమీషన్ల దందాను ప్రోత్సహిస్తున్న కొందరు డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వైద్యం అనేది ప్రాణాలను కాపాడే వృత్తి. వైద్యులు సమాజానికి వెన్నెముక వంటివారు. కానీ కొందరి ధనదాహం వల్ల ఆ వృత్తికే మచ్చ వస్తోంది. రోగిని ఏటీఎం మెషిన్‌లా చూడటం మానేసి, మనిషిలా చూడాల్సిన బాధ్యత వారిపై ఉంది. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి కఠిన చర్యలు తీసుకుంటేనే హిందూపురంలో ఈ వసూల్ రాజాల వేగానికి అడ్డుకట్ట వేయాలని పట్టణ ప్రజల కోరుతున్నారు పడుతుంది.

కోర్టు భవనం ఎక్కి..ఆత్మహత్య చేసుకుంటానని వ్యక్తి హల్‌చల్..!

ఉరవకొండ కోర్టు భవనం ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తున్న బోయ రాజశేఖర్

గొంతులోకి పాడుచుకుంటానని పదునైన దబ్బలను చూపుతున్న రాజశేఖర్

గాయపడిన రాజశేఖర్‌ను కిందకు తీసుకొస్తున్న దృశ్యం

నచ్చజెప్పేందుకు యత్నిస్తున్న ఉరవకొండ సివిల్ జడ్జీ దుర్గాకళ్యాణి

ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజశేఖర్

-తనకు న్యాయం చేయాలంటూ నిమిషానికో మాట మాట్లాడిన వైనం
-వ్యక్తిని నచ్చజెప్పడానికి ప్రయత్నించిన సివిల్ జడ్జీ డి.దుర్గాకళ్యాణి
--కిందకు తెచ్చేందుకు యత్నించగా కడుపులో పొడుచుకోవడంతో గాయం
-గత ఏడాది అక్టోబర్ 3న గొంతు కోసుకొని ఆత్మహత్యా యత్నం
-మానసిక స్థితి సరిగ్గా లేకనే ఇలా చేస్తున్నాడంటున్న కుటుంబ సభ్యులు

ఉరవకొండ, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

ఉరవకొండ పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జీ కోర్టు భవనం పైకెక్కి ఉరవకొండ పట్టణానికి చెందిన బోయ రాజశేఖర్ అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటానంటూ హల్‌చల్ చేయడం తీవ్ర కలకలం రేపింది. ఆదివారం 10 గంటల సమయంలో కోర్టు భవనం పైకెక్కిన అతను తనకు న్యాయం కావాలంటూ నిమిషానికో మాట మాట్లాడుతూ ఎవరైనా తనవద్దకు వస్తే పోడుచుకుంటానంటూ తన వెంట తెచ్చుకున్న ఇనుపు కడ్డీలను తలపించే పదునుగా ఉన్న దబ్బలను చూపుతూ హంగామా చేశాడు. అతని డిమాండ్ మేరకు సమాచారం అందుకున్న స్థానిక జూనియర్ సివిల్ జడ్జీ డి.దుర్గాకళా వ్యణి కోర్టువద్దకు వచ్చి అతన్ని నచ్చజెప్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. చివరికి అతన్ని పట్టుకొని కిందకు తీసుకురావడానికి పోలీసు, అగ్నిమాపక, అటవీ సిబ్బంది కోర్టు భవనంపైకి ఎక్కడంతో వారిని చూసి దబ్బలతో కడుపులోకి పొడుచుకోవడంతో అతన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వివరాల్లోకి వెళితే...

ఉరవకొండ పట్టణంలోని హమాలీ కాలనీలో నివాసముంటూ డ్రైవర్‌గా జీవనం సాగించే బోయ రాజశేఖర్ మానసిక స్థితి గత కొంత కాలంగా సరిగ్గా లేదని తెలుస్తోంది. ఈ క్రమంలో గత ఏడాది అక్టోబర్ 3వ తేదీన గొంతు కోసుకొని ఆత్మహత్యా యత్నం చేయడం, చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళితే అక్కడి నుండి తప్పించుకొని రోడ్డుపైకి పరుగులు తీయడం, పోలీసులు అతికష్టంమీద అతన్ని తీసుకొచ్చి చికిత్స చేయించడం అప్పుడు సంఘలనం రేపింది. ఈక్రమంలో అతను కోలుకున్నా మానసిక స్థితి సరిగాలేకపోగా మూర్ఛవ్యాధి కూడా తోడుకావడంతో అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారమే డిశ్చార్జి అయి ఉరవకొండకు వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో కోర్టు భవనంపైకి ఎక్కిన బోయ రాజశేఖర్ తన వెంట తెచ్చుకున్న ఇనుపు కడ్డీలను తలపించే పదునుగా ఉన్న దబ్బలను చూపుతూ తనకు న్యాయం చేయకుంటే వాటితో పొడుచుకుంటానని లేదా కిందకు దూకి చనిపోతానని వాళ్లను, వీళ్లను పిలిపించాలని నిమిషానికో మాట మాట్లాడుతూ పోలీసులతోపాటు అక్కడికి వచ్చిన అతని తల్లి నాగలక్ష్మి, భార్య లక్ష్మిదేవి, సోదరుడు, కొడుకు, ఇతర సన్నిహితులను ఇబ్బందులకు గురి చేశాడు. ఈ క్రమంలో కూడేరు సీఐ రాజు, ఉరవకొండ ఎస్ఐ జనార్ధననాయుడు, అగ్నిమాపకశాఖ అధికారి భీమలింగయ్య పదే పదే నచ్చజెప్పే యత్నం చేసినా ఫలితం లేకపోయింది. పోలీసుల చొరవతో స్థానిక అడ్వకేట్ చిన్నరాయుడు నిచ్చెన ద్వారా కోర్టు భవనం పైకెక్కి అతనితో సమస్య ఏమిటో తెలుసుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. తనకు మోబైల్ ఫోన్ కావాలని వీడియో తీసుకుంటానని అడగ్గా మోబైల్‌ను పైకి విసిరగా ఎవరికో ఫోన్ చేసేందుకు యత్నించి కాల్ కలవకపోవడంతో దాన్ని కిందకు విసిరాడు. జడ్జీను పిలిపిస్తే కిందకు వస్తానని చెప్పడంతో పోలీసులు, కోర్టు సిబ్బంది జడ్జీకు సమాచారం అందించారు. దీంతో మధ్యాన్నం 2 గంటల సమయంలో జూనియర్ సివిల్ జడ్జీ డి.దుర్గాకళ్యాణి కోర్టువద్దకు చేరుకొని కిందకు వచ్చి సమస్య ఏమిటో చెబితే విచారించి న్యాయం చేస్తానని రాజశేఖర్‌ను నచ్చజెప్పే ప్రయత్నం చేసినా అతను ఒప్పుకోలేదు. దీంతో 3.30 గంటల సమయంలో పోలీసులు, అగ్నిమాపక, అటవీశాఖ సిబ్బంది రక్షణ కవచాలను ధరించి కోర్టు భవనంపైకి ఎక్కడంతో వారిని చూసి రాజశేఖర్ దబ్బలతో కడుపులోకి పొడుచుకోవడంతో చిన్నపాటి గాయం ఏర్పడింది. దీంతో అతన్ని అప్పటికే అక్కడికి రప్పించిన 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ కూడా చికిత్సకు సహకరించకపోవడంతో పోలీసులు కాళ్ళు, చేతులు కట్టేసి చికిత్స చేయించారు. ఆపై అనంతపురం ఆసుపత్రికి రెఫర్ చేశారు.

రామనామ జపం లేని ఊరే లేదు..!!

- శిరగంవాండ్లపల్లిలో శ్రీసీతారామ లక్ష్మణ హనుమ విగ్రహాల ప్రతిష్ఠ
- ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మంత్రి సవితమ్మ...బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్...రెడ్ క్రాస్ సంస్థ జిల్లా అధ్యక్షులు జిఎం సురేష్
- మంత్రి సవితమ్మకు ఘనస్వాగతం పలికిన గ్రామస్తులు
- హిందూ సాంప్రదాయంలో అత్యంత పవిత్రమైంది శ్రీరామాలయం: బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్

గజమాలతో మంత్రి సవితమ్మను సన్మానిస్తున్న గ్రామస్తులు

గోరంట్ల, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

హిందూ సాంప్రదాయంలో అత్యంత పవిత్రమైంది శ్రీరామాలయం అని రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత జౌళిశాఖా మంత్రి సవితమ్మ పేర్కొన్నారు. గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని సిరగంవాండ్లపల్లిలో గ్రామ ప్రజల ఆధ్వర్యంలో వేదపండితులు పట్టణ పురోహితులు తారనాథశర్మ, ఆయన కుమారుడు మేఘనాథశర్మ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీసీతారామ లక్ష్మణ హనుమ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి సవితమ్మ, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్, రెడ్ క్రాస్ సంస్థ జిల్లా అధ్యక్షులు జిఎం సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ మాట్లాడుతూ హిందూ సాంప్రదాయంలో అత్యంత పవిత్రమైంది శ్రీరామాలయం అని, రామాలయం లేని ఊరు ఊరే కాదని అనే నానుడి పూర్వీకుల నుండి ఇప్పటివరకు ఉందని, అందుకే మనం మన సాంప్రదాయాలను మన దేవతా మూర్తులను కొలుచుకుంటూ ఆచరించాలని, అప్పుడే మనం మన భావితారాల యువతకు కూడా స్ఫూర్తిదాయక మైతామని, ఇక శ్రీరాముడు అంటానే సత్యం ధర్మం పరిపాలన దక్షతకు చిహ్నంగా శ్రీరామున్ని పలుకుతారని, రామరాజ్యంలో సత్యం ధర్మం నాలుగు పాదాలమీద నడిచిన కాలంగా గొప్పగా చెబుతారని రామరాజ్యాన్ని గురించి రామాలయ విశిష్టతను గూర్చి గొప్పగా తెలిపారు. బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్ మాట్లాడుతూ శ్రీరాముని పరిపాలన అంటే రామరాజ్యం, న్యాయం, ధర్మం, సమసమానత్వం, ప్రజా సంక్షేమానికి మారుపేరని, శ్రీరాముడు తన ప్రజల సుఖసంతోషాలే పరమావధిగా ఆదర్శవంతమైన "ధర్మరాజ్యం"ను అందించారని, ఆ పాలనలో ఆకలిదప్పులు, అన్యాయాలు, అక్రమాలు, నేరాలకు తావు లేని సంపూర్ణ శాంతి ఉండేదన్నారు. రాముడు తన రాజ్యంలో ప్రతి నిర్ణయాన్ని ధర్మం మరియు న్యాయం ఆధారంగా తీసుకునేవారని, ధనికులు పేదలు అనే తేడా లేకుండా ప్రజలందరినీ సమానంగా చూసేవారని ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించేవారన్నారు. దేశం సస్యశ్యామలంగా ఉంటూ, పంటలకు, వర్షాలకు లోటు లేకుండా ప్రజలు ఆనందమయమైన జీవితాన్ని గడిపారని, రామరాజ్యం కేవలం పౌరాణిక భావన మాత్రమే కాదని, ఒక పరిపూర్ణ ప్రజాస్వామ్య, ఆదర్శవంతమైన పరిపాలనా విధానానికి ప్రతీకగా నేటికీ నిలిచి ఉందని జిఎం శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా విచ్చేసిన మంత్రి సవితమ్మ, జిఎం శేఖర్, జిఎం సురేష్‌లను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులతో పాటు టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నరేష్, నిమ్మల శ్రీధర్, స్టేట్ డైరెక్టర్ సోమశేఖర్, సింగిల్ విండో బెల్లాలచెరువు చంద్ర, నారా లోకేష్ యువతరం వ్యవస్థాపకులు పచ్చా అశోక్, గ్రామ టిడిపి నేత వెంకటరాముడు, నాగేంద్ర, జనసేన మండల అధ్యక్షులు సంతోష్, బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మినారాయణ, సింగిల్ విండో డైరెక్టర్ నబిరసూల్, చింతా రామచంద్రారెడ్డి, గిరిధర్‌గౌడ్, అజంతుల్లా, కురవ మల్లికార్జున, జయరామ్, సింగిల్ విండో అధ్యక్షులు రవిమోహన్, పసుపులేటి శ్రీనివాసులు, శ్రీశైలం శ్రీనివాసులు, కురుబ మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న మంత్రి

పేద మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

సమావేశంలో మాట్లాడుతున్న డీఎంసీ గంగులయ్య.

హిందూపురం టౌన్ ఫిబ్రవరి 08 ప్రభాతవార్త

హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి పేద మహిళ స్వయం శక్తి సంఘాలలో చేరి ఆర్థిక అభివృద్ధి సాధించాలని మెప్మా డిస్టిక్ మిషన్ కోఆర్డినేటర్ గంగులయ్య అన్నారు. ఆదివారం హిందూపురం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంజునాథ మహిళా సమైక్య సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డిఎంసి గంగులయ్య మాట్లాడుతూ హిందూపురం పురపాలక సంఘంలోని మహిళా సమైక్యలను, ఎస్,ఎల్,ఎఫ్ లను బలోపేతం చేయాలని, స్వయం శక్తి సంఘాల ద్వారా మహిళలు ఆర్థిక సాంకేతిక సామాజిక జీవన విధానాలలో మార్పు తీసుకోవచ్చని తెలిపారు. పట్టణంలోని ఎస్ ఎల్,ఎఫ్,లు సమావేశాలు విధిగా నిర్వహించి పొదుపు అంతర్గత రుణాలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లింపులు చేయాలని సూచించారు. పుస్తక నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను స్వయం శక్తి సంఘాలలోని ప్రతి మహిళ వినియోగించుకోవాలని తెలిపారు. అక్షరాంధ్ర కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యతను నిర్మూలించడమే ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా గంగులయ్య తెలిపారు ఈ మేరకు ప్రతి ఒక్కరూ అవగాహనతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఓ నాగేంద్ర, ఎస్,ఎల్,ఎఫ్ ఆర్,పి నసీమా, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సీఎం సొంత కంపెనీలోనే నాణ్యత లేదు

మీడియాతో మాట్లాడుతున్న వేణురెడ్డి

హిందూపురం టౌన్ ఫిబ్రవరి 08 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి సంబంధించిన హెరిటేజ్ కంపెనీలోనే పెరుగు నాణ్యత లేదని ఎఫ్,ఎస్,ఎస్,ఎ,ఐ ఇటీవల జరిమానా విధించిందని తిరుమల లడ్డు నాణ్యత గురించి మాట్లాడే నైతిక హక్కు ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడుకి లేదని హిందూపురం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కుడు వేణురెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తిరుమల లడ్డు ప్రసాదంపై లేనిపోని రాజకీయాలు చేస్తున్నా రని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీరు తిరుమల లడ్డు నాణ్యత గురించి, నెయ్యి గురించి దుష్ప్రచారాలు చేస్తున్నారు. కానీ మీ కుటుంబ సంస్థ అయిన హెరిటేజ్ లో పరిస్థితి ఏమిటి మీ కంపెనీ తయారు చేస్తున్న పెరుగులో నాణ్యత లేదని స్వయంగా భారత ఆహార భద్రత మరియు ప్రమాణాల ప్రాధికార సంస్థ గుర్తించింది. చంద్రబాబు దీనికి సమాధానం చెప్పాలని అన్నారు. సొంత డెయిరీలోనే నాణ్యత లేని ఉత్పత్తులు అమ్ముతూ, తిరుమల లడ్డుపై విమర్శలు చేయడం చంద్రబాబు ద్వంద్వ వైఖరికి నిదర్శనమని వేణురెడ్డి ఎద్దేవా చేశారు. ప్రతిపక్షం పై విమర్శలు మాని సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని కూటమి ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

హత్య కేసు నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

హత్య కేసులో వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ సీఐ దృశ్యం

రొళ్ల ఫిబ్రవరి8 ప్రభాతవార్త

మండలంలోని ఎం.రాయపురంలో శనివారం జరిగిన హత్య కేసులో నిందితుడిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు.ఈ మేరకు స్థానిక పోలీసు కార్యాలయంలో సీఐ రాజ్ కుమార్,ఎస్ఐ గౌతమి సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఎం. రాయపురం గ్రామానికి చెందిన ప్రసన్నకుమార్ పై అదే గ్రామానికి చెందిన నాగరాజ్ తన భార్యపై అనుమానం పెంచుకొని ప్రసన్న కుమార్ చెనువుగ ఉంటున్నాడని అనుమానంతో నాగరాజ్ ప్రసన్న కుమార్ ను హతమార్చినట్లు సీఐ రాజ్ కుమార్ పేర్కొన్నారు.ఇటీవల కూడా భార్యపై అనుమానంతో గ్రామంలో పలువురిని నాగరాజ్ నిందించగా తాజాగా ప్రసన్న కుమార్ నాగరాజ్ భార్యతో చెనువుగా ఉంటున్నాడని తెలుసుకొని అనుమానంతో నాగరాజ్ ప్రసన్న కుమార్ ను కర్రతో బాది చంపినట్లు ఏఎస్ఐ ఇదియాతుల్లా తెలిపారు.

వరల్డ్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో సభ్యత్వం పొందిన మండల ఉపాధ్యాయులు

చిలమత్తూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

వరల్డ్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో సభ్యత్వం పొందిన ఉపాధ్యాయులు

చిలమత్తూరు మండల ఉపాధ్యాయులు సుందర్‌రాజు, బాబాజాన్, చంద్రమౌళిలు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణలో పాల్గొని ప్రవేశ్ కోర్స్ పూర్తి చేసి, వరల్డ్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో సభ్యత్వం పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో విద్యార్థుల్లో కనుమరుగవుతున్న దేశభక్తి, నైతిక, సామాజిక, మానవతా విలువలను విద్యతో పాటు ప్రాథమిక విద్యాభ్యాసం నుంచే పెంపొందేలా కృషి చేస్తామని తెలిపారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రవేశ్ కోర్స్ పూర్తి చేసిన ఉపాధ్యాయులకు మండల విద్యాధికారులు హనుమంతరెడ్డి, సాల్మన్‌రాజు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

శ్రీసీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠలో

బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్

గోరంట్ల, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

గోరంట్ల మండలం శిరగంవాండ్లపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన శ్రీసీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామిస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి శ్రీసత్యసాయి జిల్లా బిజెపి అధ్యక్షులు జిఎం శేఖర్ కుటుంబ సమేతంగా విచ్చేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు బోయ లక్ష్మినారాయణ, సోషల్ మీడియా జిల్లా కోకన్వీనర్ మేదర శ్రీనివాసులు, కాచర్ల హరీష్, బిజెపి నాయ కులు, కార్య కర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షులు

పావగడ శనీశ్వర స్వామి సన్నిధిలో సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్

శనీశ్వర స్వామి సన్నిధిలో సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్

పావగడ, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆదివారం పావగడ పట్టణంలో అత్యంత ప్రసిద్ధి గాంచిన శనీశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతలాంబ దేవికి కూడా పూజలు నిర్వహించారు. యస్‌యస్‌కె సంఘం డైరెక్టర్ మాజీ అధ్యక్షుడు కెవి శ్రీనివాస్ శాలువా కప్పి కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను సన్మానించారు. అనంతరం కోటె ఆంజనేయ స్వామిని దర్శించుకుని వెళ్ళారు.

గ్రూప్స్ విజేతలకు సత్కారం

విజేతలను సన్మానిస్తున్న గ్రంథాలయ కమిటీ

గోరంట్ల ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఇటీవల ఏపీపీఎస్సీ గ్రూప్ 1,2 వెలువడిన ఫలితాలలో ఎంపికైన గోరంట్ల మండలానికి చెందిన జీవనజ్యోతి, గ్రూప్ 1 తేజస్ రెడ్డి, గ్రూపు2 విజేతులకు ఘనంగా దుశాల్వాతో సత్కరించమైనది అదేవిధంగా గోదావరి ఒలంపియాడ్ మ్యాథ్స్ అండ్ సైన్స్ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో4 వర్యాంక్ సాధించిన 4 వ తరగతి విద్యార్థులు గానవి, చంద్రప్రియను ఘనంగా సత్కరించడమైనది ఈ కార్యక్రమానికి గ్రంథాల అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షు డు రిటైర్డ్ ఎంఈఓ శ్రీరాములు అధ్యక్షత ఆయన మాట్లాడుతూ వీరిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు అందరూ అత్యున్నత స్థాయిని పొందాలని తెలిపారు గ్రూప్ 1 విజేత జీవనజ్యోతి మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా క్రమశిక్షణతో మెలిగితే భవిష్యత్తులో మంచి పౌరులుగా రాణించటానికి అవకాశం ఉందని వక్కాణించారు తేజేష్ రెడ్డి మాట్లాడుతూ క్రీడల పైన ధ్యాస ఉన్నప్పటికీ చదువు పట్ల అశ్రద్ధ వహించరాదని కష్టపడి చదివి తమ తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు సమాజానికి మంచి పేరు తేవాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షు డు ఆదినారాయణ, ఉపాధ్యక్షులు శ్రీదేవి, బైసాని శ్రీనివాస గుప్తా, ఆర్ఎంపి బాబయ్య గ్రంథాలయ అధికారి శ్రీధర్ ఉపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, గ్రూప్ వన్ విజేత జీవనజ్యోతి తండ్రి శ్రీనివాసులు, జగదీష్, పాల్గొని మాట్లాడుతూ విద్య యొక్క ప్రాముఖ్యతను తెలుగు భాష ఔన్నత్యము విజేతలకు కృషి గురించి ప్రసంగించారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు గ్రామ పెద్దలు, గ్రంథపాఠకులు పాల్గొన్నారు.

పార్టీ బలపెంతం కోసం పంచాయతీ కమిటీలు

మండల కమిటీలు నియమిద్దాం : ఇంచార్జ్ ఈరలక్కప్ప, నియోజకవర్గం పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి

మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త

అమరాపురం ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

మండల పరిధిలోని బసవనపల్లి గ్రామ పంచాయతీ పరిధి ఆరోనపల్లి తండాల్లో మాజీ డీలర్ కృష్ణ నాయక్ ఇంటి ఆవరణంలో కార్యకర్తల సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అదేవిధంగా కే.శివరం పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ చిత్తయ్య నేతృత్వంలో కార్యకర్తల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. దీనికి మడకశిర నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ ఈరలకప్ప, నియోజకవర్గ పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి, మండల పరిశీలకులు వైసీ గోవర్ధన్ రెడ్డి, కోడి పల్లి కామరాజు, వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ త్రిలోక్నాథ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు గ్రామపంచాయతీలో ఉన్నటువంటి కార్యకర్తలతో పంచాయితీ కమిటీని, అనుబంధ కమిటీలను ఎంపిక చేశారు. ఉద్దేశించి మాట్లాడుతూ పార్టీకి మూల స్తంభాలు గ్రామ, పంచాయతీ, మండల కమిటీలను వారు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు మోసపూరితమైనటువంటి హామీలు ఇస్తూ అధికారంలోకి వచ్చారని వారు పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చినటువంటి హామీలు ఏ ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని కార్యకర్తలకు గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది అంటే ప్రజలకు ఎలాంటి లాభం ఉండదని ఎందుకంటే ఏ కార్యక్రమం చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తల జేబులోకి డబ్బులు నేరుగా వెళ్తాయని గుర్తు చేశారు. ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు నాయకులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరసింహప్ప, బసవనపల్లి వైసిపి కన్వీనర్ శివకుమార్, మాజీ స్కూల్ కమిటీ చైర్మన్ రమేష్, నాయకులు నారాయణప్ప, దాసప్ప, హనుమంతునిపల్లి రంగప్ప, రంగప్ప, మధుసూదన్, సిద్దేశ్, పరమేష్, నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం

కొత్తచెరువు ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

ఆర్థిక సహాయం చేస్తున్న వైసీపీ నాయకులు

కొత్తచెరువు మండలం నారేపల్లి పంచాయతీ కదిరెప్ప పల్లి గ్రామానికి చెందిన ముష్టూరు చంద్రయుడు , ముష్టూరు కేశవలు పూరి గుడిసెలు (బాధ కొట్టాలు) అగ్ని ప్రమాదంలో పూర్తిగా ఖాళీ బూడిద కావడం జరిగింది అగ్ని ప్రమాదంలో ఇంటిలో ఉన్న ఆహారపు ధాన్యాలు బియ్యం , కంది బేడలు తదితర వస్తువులు, బట్టలు తదితర నిత్యవసర వస్తువులు పూర్తిగా ఖాళీ బూడిద అయ్యాయి ఇల్లు పూర్తిగా కాలిపోవడం తో బాధితులు కి కనీసం తిండిగాని లేకపోవడంతో కట్టుబట్టలతో నిర్వాసితులయ్యారు స్థానికులు ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుచున్నారు స్థానిక సర్పంచ్ బోయ ప్రకాష్ , వైయస్సార్సీపి లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి వాల్మీకి శంకర్ మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి గ్రామ కమిటీ అధ్యక్షులు రమణారెడ్డి ఉపసర్పంచ్ నారాయణస్వామి మాజీ డైరెక్టర్ కేశప్ప, తదితరులు వారి కుటుంబం దగ్గరికి వెళ్లి బాధితులకు కొంతమేర ఆర్థిక సహాయం చేశారు. కట్టుబట్టలతో నిర్వాసి తులైన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి ఆర్థికసాయం

ఎంబీబీఎస్ విద్యార్థినికి ఆర్థిక సాయం అందిస్తున్న తొగట వీర క్షత్రియ కల్యాణమండపం కమిటి సభ్యులు

ధర్మవరంటౌన్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

పట్టణంలోని శాంతినగర్ కు చెందిన వేల్పుల జాహ్నవి కర్నూల్‌లో ఎంబీబీఎస్ తృతియ సంవత్సరం చదువుతోంది. చదువులో రాణిస్తూ మంచి ప్రతిభ కనబరుస్తోంది. అయితే ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటంతో విషయం తెలుసుకున్న తొగట వీర క్షత్రియ కళ్యాణమండపం కమిటీ ఆధ్వర్యంలో రూ.80వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటి అధ్యక్షులు బండారు ఆదినారాయణ, ఉపాధ్యక్షులు దాసరి వెంకటేశులు, కార్యదర్శి పుట్లూరురాజు, కోశాదికారి మద్దన నరసింహులు, మాజీ అధ్యక్షులు మేకల ఆశ్వర్థనారాయణ, డైరెక్టర్ పూట్లూరు నరసింహులు పాల్గొన్నారు.

ఏపీ పద్మశాలీయసంఘం రాష్ట్రకమిటిలో ధర్మవరం వాసులకు చోటు

మెటికల కుళ్లాయప్ప

జింకా రాజేంద్రప్రసాద్

ధర్మవరంటౌన్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ పద్మశాలీయ సంఘం రాష్ట్ర కమిటిలో ధర్మవరం వాసులకు చోటు లబించిది. శనివారం మంగళగిరిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ పద్మశాలీయ సంఘం రాష్ట్ర కమిటీని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగ్గారపు శ్రీనివాసరావు ప్రకటించారు.ఈ మేరకు ధర్మవరంకు చెందిన మెటికలకుళ్లాయప్పను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, జింకా రాజేంద్రప్రసాద్ ను రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. దీంతో ధర్మవరం పద్మశాలీయ సంఘం నాయకులు, కులబాందవులు మెటికల కుళ్లాయప్ప, జింకా రాజేంద్రప్రసాద్ లను అభినందించారు.

ప్రమాదవశాత్తు దుప్పి మృతి

బత్తలపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

మృతి చెందిన దుప్పి

రైల్వే బ్రిడ్జి వద్ద బ్రిడ్జి పైఎగురుతున్న సమయంలో అదుపుతప్పి గోడను ఢీ కొని దుప్పి ఆదివారం మృతి చెందింది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. మండలంలోని నల్లబోయనపల్లి గ్రామానికి వెళ్లే దారిలో రైల్వే బ్రిడ్జి ఉంది. ఈ బ్రిడ్జి మీద ఆదివారం ఉదయం ఎక్కడినుంచో వచ్చిన దుప్పి ఎగురుతూ వచ్చి బ్రిడ్జి గోడను ఢీ కొని మృతి చెందింది. స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని దుప్పికి నీరు తాపి రక్షించే ప్రయత్నం చేశారు. అయితే అది ప్రాణాలు వదిలేసింది. ఈ సమాచారాన్ని బత్తలపల్లి పోలీసులకు చేరవేయగా వారు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. వారు సంఘటనాస్థలానికి చేరుకుని పశువైద్యులతో పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు అధికారులు పాల్గొన్నారు.

మహర్షి వాల్మీకి సేవాదళ్ జిల్లా కార్యదర్శిగా దత్త పవన్ నియామకం

దత్త పవన్ ను సన్మానిస్తున్న దృశ్యం.

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 08ప్రభాతవార్త

మహర్షి వాల్మీకి సేవాదళ్ అనంతపురం జిల్లా కార్యదర్శి గా అనంతపురం అర్బన్ ఎర్రనేల కొట్టాల కు చెందిన దత్త పవన్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల మహర్షి వాల్మీకి సేవాదళ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమావేశం లో బోయలను ఎస్టి జాబితాలో చేర్చడానికి మరియు అనేక అంశాలమీద చర్చ జరిగింది. వ్యవస్థాపక అధ్యక్షుడు కొండపల్లి అక్కులప్ప, రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ కోగటం రవి ఆధ్వర్యం లో జరిగిన సమావేశం లో పలు అంశాల పై చర్చించారు. అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా భానుకోట శివ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో వాల్మీకి సభ్యులు బోయ కుల్లాయి , బోయ దిలీప్ వాల్మీకి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యా సంస్థలకు ఊపిరి పోయండి

క్వార్టర్ల బకాయిలు విడుదల చేయండి

- ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని వినతి

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గోరంట్ల, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

పెండింగ్ ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖా మంత్రి సవితమ్మకు ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పెద్దరాసు భక్తవత్సలం వినతిపత్రం అంద చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే బకాయిలను విడుదల చేయాలని మంత్రిని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు సంబంధించిన పెండింగ్ ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని ఆదివారం మంత్రి స్వగృహంలో ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రికి ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నామని కళాశాలలో పనిచేసే సిబ్బంది వారి కుటుంబాలు కూడా సంస్థలపై ఆధారపడి ఉంటాయన్న విషయాన్ని ప్రభుత్వాలు గుర్తించుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత రెండు సంవత్సరాలకు సంబంధించి కేవలం ఒకటిన్నర క్వార్టర్స్ ఫీజు రీయంబర్స్‌మెంట్ మాత్రమే విడుదల అయిందని ఇంకా ఆరున్నర క్వార్టర్స్‌ను ప్రభుత్వం బకాయిలు పెట్టిందని దీంతో కళాశాలలు నడపలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వం మూడు క్వార్టర్లు పెండింగ్ పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించి బకాయిలను విడుదల చేయాలన్నారు. బకాయిలు విడుదల చేయని పక్షంలో ఇలాంటి పరిస్థితి కొనసాగితే అధ్యాపకుల జీతాల చెల్లింపులు, విద్యా నాణ్యత పరిరక్షణ, కళాశాల నిర్వహణ వంటి అంశాలు తీవ్ర ప్రభావితం అయ్యే ప్రమాదం పొంచి ఉండే అవకాశం లేకపోలేదన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యా శాఖామంత్రి నారా లోకేష్‌లు ప్రైవేట్ డిగ్రీ కళాశాలల దుస్థితిని ఆలోచించి తక్షణమే బకాయిలను విడుదల చేయాలన్నారు. ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్లు అప్పులు చేసి అధ్యాపకులకు జీతాలు చెల్లిస్తున్న దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం స్పందించి మా సమస్యలను పరిష్కరించాలని ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రెసిడెంట్ భక్తవత్సలం కోరారు. ఈ కార్యక్రమంలో ఎసిపివిఎం డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పెద్దరాసు సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహ విముక్తి రథయాత్ర

ఫోక్స్ చట్టాలపై అవగాహన కార్యక్రమాలు
అవగాహన కల్పిస్తున్న శక్తి టీం.

పుట్టపర్తి రూరల్ ఫిబ్రవరి 08 ప్రభాతవార్త

జిల్లా ఎస్పీ శ్రీ ఎస్ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు శ్రీ సత్యసాయి జిల్లాలో బాల్యవివాహ వ్యవస్థను నిర్మూలయించాలన్న సంకల్ప తో బాల్య వివాహ విముక్తి రథయాత్ర వాహనం ద్వారా గ్రామాలలో పోలీసులు, శక్తి టీం బృందాలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం జిల్లాలోని పలు గ్రామాలలో నూతన చట్టాలు బాల్య వివాహాలు పోక్సో వంటి వాటిపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు అరికట్టాలనే ఉద్దేశం తో సత్యసాయి జిల్లాలో ఈ రథ యాత్ర చేపట్టడం జరిగిందని పోలీసులు శక్తి టీం బృందాల ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన రాష్ట్ర బోర్డు పరిశీలకులు

కొత్తచెరువు ఫిబ్రవరి 8 ప్రభాతవార్త.

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాలను రాష్ట్ర పరీక్షల పరిశీలకులు రమేష్ హిందూపురం మరియు ధర్మవరం పట్టణాలలో పరీక్ష కేంద్రాలు పరిశీలించారు ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలలో భాగంగా 25 కళాశాలల లో ప్రయోగ పరీక్షలు జరగాయని డిఐఈఓ చెన్నకేశవ ప్రసాద్ తెలిపారు . ఆదివారం ఉదయం జరిగిన పరీక్ష లో 1489 మంది విద్యార్థులకు గాను 1433 మంది హాజరు కాగా 56 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు.మధ్యాహ్నం జరిగిన పరీక్ష లో 1274 మందికి గాను 1224 మంది హాజరు అయ్యారు. 50 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు.ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు కదిరి,నల్లచెరువు మరియు తనకల్లు కళాశాలల లోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

పన్ను వసూళ్లపై పంచాయతీ అభివృద్ధి అధికారుల మెడపై కత్తి

- ఇంటి పన్ను వసూలు ఈ నెల 15 లోపు పూర్తి చేయకపోతే విధుల నుంచి సస్పెన్షన్ చేస్తాం,
- ఆందోళనలో పంచాయతీ అభివృద్ధి అధికారులు.



అనంతపురం రూరల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

ఇంటి పన్ను, ఇతర పన్నుల వసూళ్లు పైన పంచాయతీ అభివృద్ధి అధికారుల మెడపై కత్తి తో పాటు వారి ఉద్యోగాలకు ఎసరు తెచ్చే విధంగా కూటమి ప్రభుత్వ విధానాలు కనిపిస్తున్నాయని పలువురు అధికారులు గుసగుస లాడుకోవడం జరుగుతుంది. ఈ నెల 15 లోగా 100 శాతం వసూళ్లు పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశించింది. గడువులోపు చేయ కుంటే సస్పెండ్ చేస్తామని హెచ్చరించింది. సంపద సృష్టిస్తామంటూ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కూడా పూర్తికాకముందే దాదాపుగా మూడు లక్షలకోట్లు అప్పు చేసి రాష్ట్రం నడ్డి విరిచింది. పైపెచ్చు స్వర్ణాంధ్ర అంటూ పేర్లు పెట్టడం తప్ప కిం దిస్థాయి ఉద్యోగుల బాదలు పట్టడం లేదు: దీనిపై పలువురు పంచాయతీ అభివృద్ధి అధికారులు బహిరంగానే విమర్శిస్తుకోవడం జరుగు తుందని సమాచారం.ప్రతి సంవత్సరం ఇంటి పన్ను వసూళ్లకు మార్చి నెలలో నోటీసులు జారీ చేసి ఆ నెలాఖరుకు గానీ, ఏప్రిల్ చివరకు గానీ పంచాయతీ అభివృద్ధి అధికారులు వసూలు చేస్తూ వస్తున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వానికి మరెక్కడా అప్పు పుట్టక తమపై పడిందంటూ గ్రామ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ మెడపై కత్తి పెట్టి పన్నులు వసూలు చేయాలని చెప్పడం ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్ని స్తున్నారు. ఈ నెల 15వ తేదీ నాటికి 100 శాతం పన్ను వసూలు చేయలేని పంచాయతీ

ఏ వయసులోనైన ఫిట్స్ రావచ్చు అంతర్జాతీయ ఎపిలెప్సి దినోత్సవం
- కిమ్స్ సవీరా కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డా.పి.కార్తీక్ రెడ్డి

అనంతపురం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త బ్యూరో

ఎపిలెప్సి (మూర్ఛ లేదా వాయి జబ్బు) గురించి ఇప్పటికీ ప్రజల్లో అనేక అపోహలున్నాయి, వారిని ప్రత్యేక దృష్టితో చూస్తారు. వైద్య విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందింది,ఫిట్స్ నియంత్రణకు ఎన్నో మందులు అందుబాటులో ఉన్నాయి మరియూ చికిత్స చేస్తే మెరుగైన ఫలితాలుంటాయి. మందులతో తగ్గని ఫిట్స్‌కు సర్జరీ ద్వారా కూడా నయము చేయవచ్చు. ప్రతి సంత్సరమూ అంతర్జాతీయ ఎపిలెప్సి దినోత్సవం జరుపుతారు, దీని ఉద్దేశం ప్రజలలో అవగా హన కల్పించటం. ఈ జబ్బు ఉన్న స్త్రీలు పెళ్లిల్లు చేసుకోవచ్చు. మందులు వాడితే జబ్బు కంట్రోల్ లో ఉంటుంది. గర్భిణిగా ఉన్నప్పుడు ఫిట్స్ మందులు వాడొచ్చు. దీని వల్ల తల్లికీ, బిడ్డకు ప్రమాదం ఉండదు, అయితే కొన్ని రకాల మందులను ఈ సమయం లో మార్చవలసి ఉంటుంది, కావున నరాల వైద్య నిపుణులను కలవటం మంచిది. మూర్ఛ(ఎపిలెప్సీ /ఫిట్స్) ప్రతి 1000 మందిలో నలుగురికి ఉంటుంది. ఇది ఏ వయసు లోనైన రావచ్చు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు రావచ్చు. కానీ చాలా సాధారణంగా ఇది రెండేళ్ల వయసులోపు, ఆ తర్వాత 50, 60 ఏళ్లు పైబడిన వారిలో వస్తుంది. మధ్య వయసులో రావడం తక్కువే. మూర్ఛ మొదలైన తర్వాత వీరిలో నియంత్రణ లేకపోవడం వల్ల దీర్ఘకాల ఎపిలెప్సీతో ఏళ్లతరబడి బాధపడుతుంటారు.

ఫిట్స్ ఎలా వస్తుంది : మొదడులోని ఒక బాగంలో అవసరానికి మించి విద్యుత్శక్తి ఉత్పత్తి అవడం వల్ల ఫిట్స్ వస్తాయి. ఇలా ఉత్పత్తి అయిన విద్యుత్ ఏ భాగం నుంచి ఎక్కడికి వస్తుంది అనేదాన్ని బట్టి రోగికి లక్షణాలు మొద లవుతాయి. మెదడు ఎదుగుదలలో లోపం ఇంకో కారణం. కొంత మందిలో ఒక భాగంలో లేదా రెండు నుంచి మూడు మిల్లీ మీటర్లు లేదా సెంటీమీటర్ భాగంలో ఫిట్స్ ఉండొచ్చు. కొన్నిసార్లు మొదడు అర్ధ భాగం లేదా మొత్తం మొదడులో అసాధరణ పరిస్థితి ఉండొచ్చు. పిల్లల్లో వచ్చే నియంత్రించలేని ఫిట్స్ కి ఇదొక కారణం. ఇక పెద్దవారిలో ఫిట్స్ కు కారణం మొదడులోని కణితు లు మరియు ఇన్ఫెక్షన్స్ అనగా టిబి , న్యూరోసిస్టిసర్కోసిస్ మొదలగునవి.

జన్యువరమైన కారణాల వల్ల కూడా ఫిట్స్ రావచ్చు : చిన్నప్పుడు జ్వరంతో ఫిట్స్ వస్తాయి వీటిని ఫెబ్రైల్ సీజర్స్ అంటారు ఇవి సాధారణంగా 6 సంవత్సరాల తరువాత ఆగిపోతాయి.

ఫిట్స్ లో రకాలు : ఎవరైనా కాళ్లు, చేతులు కొట్టుకుంటూ కిందపడిపోతేనే వారు ఫిట్స్ తో బాధపడుతున్నారు అని అనుకుంటాం, ఇలా అందరికీ జరగదు. ఫిట్స్ లక్షణాలు భిన్నంగా కూడా ఉంటాయి..

కాంప్లెక్స్ పర్టియల్ సీజెర్స్ : ఉన్నట్లుండి చేస్తున్న పని ఆపి 20 నుంచి 30 సెకన్లు బొమ్మాలా ఉంటారు. ఈ సమయంలో వీరిని పలకరించినా మాట్లాడరు. ఏమైందని అడిగితే నాకేమైందని ఎదురు ప్రశ్న వేస్తారు, వారికి ఏమీ గుర్తుండదు. ఆ సమయంలో వీరు చేతులు నలపడం, మింగినట్లు చేయడం, మూతి చప్పరించడం చేస్తుంటారు. చూసే వారికి ఎందుకిలా చేస్తుంటారు అని అనుకుంటారు. కానీ ఫిట్స్ అని తెలుసుకోలేరు. ఇలా అస్తమానం చేస్తుంటే ఫిట్స్ అని గుర్తించాలి. ఈ తరహా ఫిట్స్ ని కాంప్లెక్స్ పర్టియల్ సీజెర్స్ అంటారు, ఇలా ఉన్నవారు వెంటనే డాక్టర్ గారిని సంప్రదించాలి.

కిమ్స్ సవీరా కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డా.పి. కార్తీక్ రెడ్డి

అబ్సెన్స్ ఫిట్స్: చేస్తున్న పనిని ఆపేసి తదేకంగా చూస్తూ ఉండిపోవడం. నాలుగేళ్ల నుంచి 10 ఏళ్ల వయసు పిల్లల్లో ఇది సాధారణం. స్కూల్లో టీచర్ చెబుతుంటే పిల్లలు రాస్తూ రాస్తూ ఆకస్మాత్తుగా రాయం ఆపేస్తారు, 10 నుంచి15 సెకన్లు ఆపేసి మళ్లీ రాయడం మొదలుపెడుతారు. ఇలా రోజుకు 20 నుంచి 30 సార్లు ఒక్కోసారి వందసార్లు కూడా అవుతుంది. ఈ రకం ఫిట్స్ మందులతో బాగా తగ్గుతుంది. టెంపరల్ లోబో ఎపిలెప్సీ ఈ జబ్బు మందులతో తగ్గే అవకాశం తక్కువ. ఉన్నట్టుండి ఉలికిపడుతారు. చేతుల్లో వస్తువులు పడేస్తారు.

ఫిట్స్ వ్యాధిని నిర్ధారించడం ఎలా : ఫిట్స్ వచ్చిన వారికి చాలా మంది ఇఇజి పరీక్ష చేస్తారు. ఇఇజిలో తల పై వైర్లు పెట్టి కంప్యూటర్ ద్వారా రికార్డ్ చేస్తారు. అసాధారణ విద్యుత్ శక్తి ఏ భాగం నుంచి వస్తుందో కనుక్కుంటారు.

మొదడు స్కానింగ్ : ఎంఆర్ఐ (మాగ్నటిక్ రెసినెన్స్ ఇమేజింగ్) స్కాన్ ఎపిలెప్సీ ప్రోటోకాల్. వంద మంది ఫిట్స్ రోగులకు మందులతో చికిత్స చేస్తే 60 మందికి తగ్గుతుంది. అంటే మందులతో ఫిట్స్ నియంత్రణలో ఉంటుంది. చాలా మందికి ఫిట్స్ మూడేళ్లు, ఐదేళ్లు మందులు వాడితే ఇక తగ్గిపోతుంది అనే అపోహతో ఉంటారు. వందలో 10 నుంచి 15 శాతం రోగుల్లో ఐదారేళ్లు మందులు వాడితే తగ్గించి ఆపేసే అవకాశముంటుంది. మిగితావారు జీవితాంతం మందులు వాడాల్సిందే. మందులు వాడటం ఫిట్స్ నుంచి రక్షణ కోసమని గుర్తించాలి. బయట రోడ్డు మీద నడుస్తునప్పుడు, వంట చేస్తునప్పుడు, ఇతర ప్రదేశాల్లో పని ప్రాంతాల్లో ఫిట్స్ వచ్చినప్పుడు కలిగే ప్రమాదాన్ని నివారించడం, ఫిట్స్ తీవ్రతను తగ్గించడం మందుల ముఖ్య ఉద్దేశ్యం. ఐదేళ్ల తర్వాత ఫిట్స్ కంట్రోల్లో ఉంటే మందుల మోతాదును తగ్గిస్తారు.

ఎపిలెప్సి సర్జరీ : మందుల వల్ల తగ్గని ఫీట్స్ వ్యాధికి ఆపరేషన్ చేస్తారు. ఈ సర్జరీ 30 ఏళ్ల క్రితమే మొదలైంది. ఈ సర్జరీకి టీం వర్క్ చాలా కీలకం. న్యూరాలజిస్ట్, న్యూరో సర్జన్, ఎంఆర్ఐ నిపుణులు, న్యూక్లియర్ మెడిసిన్ నిపుణులుంటారు.

సర్జరీ రకాలు : 80శాతం కేసుల్లో టెంపరల్ లోబో ఎపిలెప్సీ చేస్తారు. వీరిలో మంచి ఫలితాలు ఉంటాయి. ఉద్యోగాలు చేసుకోవచ్చు. పెళ్లిళ్లు చేసుకోవచచు. పిల్లల్ని కనవచ్చు.

లీజనెక్టమీ : బ్రెయిన్‌లో ఎక్కడా తేడా ఉంది తెలుసుకొని కార్టికల్ స్టిమ్యులేషన్ చేసి తీసేస్తారు.

హెమిస్పరెక్టమీ : చిన్నప్పటి నుంచి కాళ్లు చేతులు బలహీనంగా ఉండి, ఫిట్స్ వస్తుంటే ఈ ఆపరేషన్ చేస్తారు.

ఆర్డీటీ కోసం ఐక్య ఉద్యమాలు చేద్దాం
- సోమవారం కలెక్టర్ కార్యాలయంకు తరలిరండి

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

పేద ప్రజలకు సేవలు చేస్తున్న ఆర్డీటీని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరికి ఉందని ఆర్డీటీ పరి రక్షణ జేఏసీ కన్వీనర్ సాకే హరి అన్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందున్న పాథర్ విన్సెంట్ పెర్రర్ విగ్రహానికి ఆర్డీటీ పరి రక్షణ కమిటీ ఆధ్వర్యంలో పూల హారం వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నాయుకులు సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక కే.వి రమణ, బహుజన సమాజ్ పార్టీ హరి ప్రసాద్. కుల వివక్షత పోరాట సమితి వెంకటేష్, సీపీఐ ఎం,ఎల్ లిబరేషన్ వేమన, ఎమ్మార్పిఎస్ కుంటి మద్ది ఓబులేష్, డాక్టర్ అక్కులప్ప, ఎస్సీ, ఎస్టీ ఫోరమ్ నెరమెట్ల ఎల్లన్న, మాల మహానాడు సుగమంచి శ్రీనివాసులు, ఎస్సీ జన సంఘం దాసగాని పల్లి కుళ్లాయప్ప, లౌకిక రాజ్య పరి రక్షణ సమితి మందల రమేష్, గిరిజన ప్రజా సంక్షేమ సంఘం గర్మ మళ్ళీ కార్జున నాయ క్, బేడా బుడగ జంగం శిరిశాల అంజి, పూసల సంఘం హనుమంతు, రజక సంఘం ఈశ్వరయ్య,దివ్యాంగుల హక్కుల పోరాట సమితి హరి నాథ్ రెడ్డి, నవ యువ సమైక్య విశ్వనాథ్, మాట్లాడుతూ..1969నుండి ఆర్డీటీ ఉమ్మడి జిల్లాలో పేద ప్రజలకు అన్ని రంగాలోను ఎన్నో సేవ లందించిన సంస్థను కాపాడుకుందామన్నారు. కేంద్ర ప్రభు త్వం ఆర్డీటీ విదేశీ నిధులు రాకుండా నిలుపుదల చేయడం అన్యాయమన్నారు. ఆర్డీటీ పరి రక్షించు కోవాడానికి ఇప్పటికే అనేక రకాలుగా అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున ఆందో ళనలు, ఉద్యమాలు చేసిన్నప్పటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరుణి ంచలేదన్నారు. ఎఫ్‌సిఆర్ఎ రిజస్ట్రేషన్ వెంటనే చేయాలని సోమవారం జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ గారికి ప్రజా సమస్యల పరి స్కార వేదికలో వినతి పత్రం ఇవ్వడానికి అన్ని రాజకీయ, వామపక్ష పార్టీలు కుల ప్రజా సంఘాలు, అభ్యుదయ ప్రజాసామికవాదు లు,ఆర్డిటి అభిమానులు తరలి రావాలని పిలుపునిస్తున్నాము. కార్యక్రమంలో నాయకులు రమణయ్య, భీమ్ సేన రావ్, రామకృష్ణ,శివ, ముత్యాలు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కన్వీనర్ సాకే హరి

"బాలూ గారి శత గళార్చన" కార్యక్రమ గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

అనంత నగరములో స్థాపింప తలపెట్టిన బాలూ కాంస్య విగ్రహము, కళాక్షేత్రంలో భాగంగా ఆ సంస్థ మార్చి ఒకటవ తేదీన వంద మంది గాయనీ గాయకులతో నిర్వహిస్తోన్న "బాలూ గారి శత గళార్చన" సంగీత విభావరికి సంబంధించిన గోడ పత్రికలను (పోస్టర్స్) బాలూ సహా విద్యార్థి అనంతపురం వాసి జెమినీ సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు విజయ రాఘవన్ ఇది బాలుకి సమర్పిస్తున్న విశిష్ట కార్యక్రమం. ఇందులో జిల్లాలోని బాలూ అభిమానులకు అవకాశం కల్పిస్తున్నాము. కావున జిల్లాలోని సినీ సంగీత అభిమానులు విరివిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా సంస్థ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, బాలూ ఆలపించిన ప్రత్యేకమైన వంద పాటలను వంద మంది జిల్లాలోని గాయనీ గాయకులు ఆలపించి బాలుకి స్వర నివాళి అర్పిస్తారని, ఈ కార్యక్రమాన్ని అనంత జిల్లా వాసులు విజయవంతం చేయాలని కోరారు. పోస్టర్ విడుదల కోసం ముఖ్య అతిథిగా విచ్చేసిన బాలు సహా విద్యార్థి జెమినీ సత్యనారాయణ, బాలుతో తమ అనుబంధాలను నెమరు వేయటం జరిగింది. "బాలూ గా రి శత గళార్చన" కార్యక్రమ నిర్మా త అనంత్ నాగ్ సంగీత్ స్వర్గ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రసంగిస్తూ బాలూ అభిమాను లు, సినిమా పాటల ప్రేక్షకులు అందరని అలరించే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అందరూ పాల్గొని ఆనందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో "అనంత కళా సమితి"కి చెందిన కోశాధికారి రామాంజి, ఉపాధ్యక్షులు ఓబుల దాస్, శ్రీ బాల మురళీకృష్ణ, సురేష్ బాబు, విజయలక్ష్మి, వీరలక్ష్మి, నంజుం డప్ప, శ్రీ సాయి విజ్ఞాన విద్యా సంస్థల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మల్లారెడ్డి సేవలు మరువలేనివి

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

స్థానిక ఉపాధ్యాయ భవన్ అనంతపురంలో ఇటీవల గుత్తి ఉప విద్యాశాఖ అధికారిగా పనిచేసి పదవీ విరమణ చేసిన పి.మల్లారెడ్డి సన్మాన కార్యక్రమం ఘనంగా ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం గుత్తి డివిజన్ అధ్యక్షుడు ఎం.సుంకన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు పాల్గొని పి.మల్లారెడ్డి చేసిన సేవలను కొనియాడారు. అలాగే సమగ్ర శిక్ష ఏపీసి శైలజ, కూడా మల్లారెడ్డి, సమగ్ర శిక్ష చేపట్టిన అనేక కార్యక్రమాలను విజయవంతం చేయడంలో పి.మల్లారెడ్డి యొక్క సహకారాన్ని మరువలేము అని పేర్కొన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర కోశాధికారి విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. పీ మల్లారెడ్డి డివిజన్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు సమస్యను పరిష్కరించడంలో సంఘానికి సహకరించాలని పేర్కొన్నారు. సాధారణ పరీక్షల మండలి జిల్లా కార్యదర్శి గంధం శ్రీనివాసులు, మల్లారెడ్డితో ఉన్నతన తనకున్న అనుబంధాన్ని ఎవరు వేసుకున్నారు, ఆంధ్రప్రదేశ్ ప్రధానోపా ధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జయరామిరెడ్డి మాట్లాడుతూ.. పి.మల్లారెడ్డి జిల్లా విద్యాశాఖలో తనదైన ముద్రను వేశారని ప్రధానోపా ధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్క రించాలని ప్రధానోపాధ్యాయులకు మనోధైర్యాన్ని అందించా లని దానికి మల్లారెడ్డికి ఆంధ్రప్రదేశ్ ప్రధానో పాధ్యాయ సంఘం తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డి లక్ష్మినారా యణ, గుత్తి డివిజన్ ప్రధాన కార్యదర్శి శివ శంకర్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యులు మల్లికార్జున, నారాయణరెడ్డి జిల్లా కోశాధికారి హరినా థ్, కళ్యాణ్ దుర్గం డివిజన్ బాధ్యులు ఆదిశేషయ్య, మండల విద్యాశాఖ అధికారులు జి శివప్రసాద్, పిఆర్‌వి ప్రసాద్, మదన్ మోహన్ రెడ్డి, మునఫ్, సూర్యనారాయణ ఉపాధ్యాయ సంఘం నేతలు శ్రీనివాస్ నాయక్, సూర్యుడు, రమణారెడ్డి, రవీంద్రనాథ్, చంద్రశేఖర్ రెడ్డి, నరసిం హారెడ్డి, వెంకటేశులు, ఆనంద్, భాస్కర్ రెడ్డి పెద్ద సంఖ్యలో ప్రధానో పాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మల్లారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

సేంద్రియ సాగులో ఉండబండ రైతు దంపతుల రికార్డు
- జై కిసాన్ ఫౌండేషన్ సభ్యులు ప్రశంసలు

అనంతపురం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం జిల్లా, విడపనకల్లు మండలం ఉండబండ గ్రామ ఆదర్శ రైతు దంపతులు సంజీవరెడ్డి, సుబ్బలక్ష్మి ప్రకృతి వ్యవసాయంలో సరికొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. జూన్ మాసపు తొలకరి చినుకులతోనే ప్రణాళికా బద్ధంగా సాగు మొదలుపెట్టి, నాణ్యమైన ఎర్ర మిరప దిగుబడిని సాధించిన వీరి పొలాన్ని జై కిసాన్ ఫౌండేషన్ చైర్మన్ నాగమల్లి ఓబులేష్ ఆదివారం సందర్శించారు. క్షేత్రస్థాయిలో పంట కోతలను పరిశీలించి, వారి సాగు పద్ధతులను అభినందించారు. తొలకరిలోనే పునాది పచ్చి రొట్టె ఎరువులతో సిరి గతేడాది జూన్ మాసంలో కురిసిన తొలి చినుకులకే ఈ రైతు దంపతులు తమ పొలంలో జనుము, జీలుగ వంటి పచ్చి రొట్టె ఎరువులను సాగు చేశారు.

పూత దశకు రాగానే వాటిని భూమిలోనే కలియ దున్నడం ద్వారా నేలకు జీవం పోశారు. ఈ పద్ధతి వల్ల రసా యన ఎరువుల అవసరం లేకుండానే నేలకు కావాల్సిన పోషకాలు పుష్కలంగా అందాయని, తద్వారా పెట్టుబడి ఖర్చు భారీగా తగ్గిందని జై కిసాన్ ఫౌండేషన్ గుర్తించింది. సైజు, రంగుపై ప్రశంసలు పంటను పరిశీలి ంచిన ఫౌండేషన్ సభ్యులు మిరప కాయల నాణ్యతను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పచ్చి రొట్టె ఎరువుల బలం వల్ల కాయలు గట్టిగా, ఆకర్షణీయమైన సైజులో ఉన్నాయి. ఎటువంటి రసాయన రంగులు వాడకుండానే, సహజ మైన ముదురు ఎరుపు రంగుతో కాయలు మెరిసిపోతున్నాయి. చీడపీడలను తట్టుకుని పంట ఆరోగ్యంగా పెరగడం విశేషం. ఆదర్శం ఈ దంపతులు జై కిసాన్ ఫౌండేషన్ ఈ సందర్భంగా జై కిసాన్ ఫౌండేషన్ నాగమల్లి ఓబులేష్ మాట్లాడుతూ.. "ఉండమండ గ్రామ రైతు దంపతులు సంజీవరెడ్డి, సుబ్బలక్ష్మి చేస్తున్న సాగు విధానం జిల్లాలోని ఇతర రైతులకు స్ఫూర్తిదాయకం. కేవలం సేంద్రియ ఎరువుల మీద ఆధారపడి ఇంతటి నాణ్యమైన దిగుబడి సాధించడం సామాన్యం కాదు. పర్యావరణాన్ని కాపాడుతూనే అధిక లాభాలు గడించవచ్చని వీరు నిరూపించారు" అని కొనియాడారు. రైతుల ఆనందం " నేలతల్లిని ఆరోగ్యంగా ఉంచుకుంటే, అది మనకు నాణ్యమైన ఆహారాన్ని, లాభాలను ఇస్తుంది. పచ్చి రొట్టె ఎరువుల వాడకం వల్లే ఈ అద్భుత ఫలితం సాధ్యమైంది" అని సంజీవరెడ్డిసుబ్బలక్ష్య దంపతులు ఆనందం వ్యక్తం చేశారు. వీరి పొలాన్ని సందర్శించిన వారిలో జై కిసాన్ ఫౌండేషన్ ప్రతినిధి చరణ్, స్థానిక రైతులు, వ్యవసాయ ప్రేమికులు పాల్గొన్నారు.

విరగకాసిన పంటను చూపుతున్న రైతు దృశ్యాలు

సైన్స్ ప్రయోగాలే శాస్త్రీయ అభివృద్ధికి పునాది
- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

విద్యార్థులు చేసే వినూత్న సైన్స్ ప్రయోగాలే శాస్త్రీయ అభివృద్ధికి పునాది అవుతుందని మాజీ ఎమ్మెల్సీ, జెవివి రాష్ట్ర గౌరవ సలహాదారు డాక్టర్ ఎం.గేయానంద్ అన్నారు. జెవివి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సంగమేష్ నగర్‌లో గల జెవివి ఆఫీస్ నందు రాష్ట్రస్థాయి యురేకా సైన్స్ ఎక్స్ పో2026, ఇతర అంశాలపై చర్చ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్న అనుభవం మనకు ఉందని, అందులో భాగంగానే విద్యార్థులలో సైన్స్ ప్రతిభా పాటవాలను వెలికి తీయాలనే ఉద్దేశంతో యురేకా సైన్స్ ప్రయోగాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులు వినూత్నంగా ఆలోచించి సైన్స్ ప్రయోగాలు చేయడం ద్వారా జ్ఞానాన్ని సంపాదించడంతోపాటు కొత్త పద్ధతులు కనుగొంటారని అన్నారు. నేడు పాఠశాల స్థాయిలో పిల్లలు చేసే ఈ ప్రయోగాలే భవిష్యత్తులో వారు రాణించడానికి ఎంతో ఉపయోగపడ తాయని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఎటువంటి ఖర్చు లేకుండా లో కాస్ట్‌నో కాస్ట్ తో విద్యార్థులు చేసే ప్రయోగాలు వారిలో ప్రత్యేకమైన ఆలో చనలను రేకెత్తిస్తాయని జెవివి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎం.ఆదిశేషు అన్నారు. 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు వ్యక్తిగతంగా కానీ, గ్రూపుగా కానీ ఏర్పడి ప్రయోగం చేసి వాటిని వీడియో ద్వారా రాష్ట్ర కమిటీకి పంపించాలని మార్చి 8న చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. కావున ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమం విజయ వంతం కావడానికి కృషి చేయా లని జిల్లాలోని ప్రతి స్కూలు నుండి విద్యార్థులు ఈ యురేకా సైన్స్ ప్రయోగ పోటీలలో పాల్గొనేలా కృషి చేయాలని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం యురేకా సైన్స్ ఎక్స్ పో పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.పి.చిత్తప్ప, కె.వీరరాజు కోశాధికారి మహమ్మద్ జిలాన్,జిల్లా అడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసరావు, సమతా నాయకులు కె.నాగరత్న జెవివి నగర అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్ రెడ్డి, తిరుపాల్ నాయకులు రామిరెడ్డి, లక్ష్మినారాయణ, ముత్యాలు, ప్రసాద్, రాఘవేంద్ర, తిప్పేస్వామి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణే యుటిఎఫ్ లక్ష్యం
- యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

పేదలకు నాణ్యమైన ప్రభుత్వ విద్య అందాలంటే ఊరి బడి ఉండాల్సిందేనని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ పేర్కొన్నారు. ఆది వారం ఉదయం అనంతపురం పట్టణంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మి రాజ అధ్యక్షతన ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాంఊరి బడిని కాపాడు కుందాం అనే అంశంపై జరిగిన పశ్చిమ రాయలసీమ జిల్లాల సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. ఈ సందర్భ ంగా కె.ఎస్. ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థుల సర్వతోన్ముఖాభివృద్ధికి పాటు పడు తూ, విద్యార్థులను అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాలలు నేడు పాలకుల విధానాల ఫలితంగా ప్రమాదపుటంచుల్లోకి నెట్టి వేయబ డ్డాయని ఆరోపించారు. ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణే లక్ష్యంగా హామీలి స్తున్న పాలకవర్గాలు తీరా గద్దెనెక్కాక హామీలను విస్మరిస్తూ ప్రభుత్వ విద్యా రంగ నిర్వహణ బాధ్యతల నుండి క్రమేపి తప్పుకునేందుకు ప్రయత్ని స్తున్నాయని విమర్శించారు. గతంలో వైసిపి ప్రభుత్వం 117జీవోను ప్రవేశపె ట్టి, పాఠశాలల విలీనం పేరుతో ప్రభుత్వ విద్యారంగాన్ని అస్తవ్య స్తంగా తయారు చేసిందన్నారు. ప్రభుత్వ బడు లను కాపాడుకునేందుకు యుటిఎఫ్ నాయకులు కార్యకర్తలు పాఠశాలల్లో ఉదయం ఒక గంట పాటు, సాయంత్రం ఒక గంట పాటు అదనంగా పనిచేసేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్.జయచంద్రా రెడ్డి, దేవేంద్రమ్మ, అనంతపురం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోటేశ్వ రప్ప, ఈశ్వరయ్య, సత్య సాయి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యద ర్శులు శ్రీనివాసులు, రామకృష్ణ నాయక్, కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు, కర్నూలు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి, నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాద్, సుధాకర్, వివిధ జిల్లాల నాయకత్వం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్

స్నేహితుని కుటుంబానికి అండగా నిలిచిన మిత్రులు

శింగనమల, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

మండల వైఎస్ఆర్‌సిపి మాజీ మండల కన్వీనర్ పూల ప్రసాద్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న అతనితోపాటు చదువుకున్న చిన్ననాటి స్నేహితులు ఆదివారం తమ మిత్రుడు ప్రసాద్ ఇంటికి చేరుకుని వారి కుటుంబ సభ్యులకు రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు. పుష్ప అనే మరో మిత్రురాలు రూ.5వేలు వారి కుటుంబ సభ్యురాలికి అందజేశారు. అంతేకాకుండా రూ.8వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు ప్రసాద్ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మిత్రులు మాట్లాడుతూ.. తమతోపాటు చదివి కొద్దిరోజుల క్రితం వరకు తమతోమాట్లాడి ఇప్పుడు తమ మధ్య లేకపోవడం తీరనిలోటని ఆ కుటుంబ సభ్యులు కూడా ఈ లోటు ఉంటుందని, అయితే మా మిత్రుని కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడు అండగా ఉంటామని వారు భరోసా ఇచ్చారు. మిత్రుని కుటుంబాన్ని సందర్శించిన వారిలో పుష్పలత, శ్రీదేవి, ఆదినారాయణ, ఎస్.నగేష్, రాధకృష్ణరెడ్డి, నరసింహారెడ్డి, ఎం.బాలరం గారెడ్డి, సూర్యనా రాయణ, నరసింహులు, మట్లగొంది ఆది, శివప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

జిల్లా కేంద్ర గ్రంధాలయంలో "చదువంటే మాకిష్టం"

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా కేంద్ర గ్రంధాలయం నందు చదువంటే మాకిష్టం కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమం నందు శిక్షకులు రిటైర్డ్ టీచర్ పుట్లూరు శ్రీరాములు గారు,కళాభూషణ్ డాక్టర్ అంకె రామలింగమయ్య, రిటైర్డ్ డీస్పీ జై హరి పిల్లలకు నీతికథలు, తెలుగు పద్యాలు, ఆంగ్లములో గ్రామర్ భోదించారు. ఈ సందర్భంగా కార్యక్రమం నకు ముఖ్య అతిథి గా హాజరైన జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ శ్రీ వడ్డే వెంకట్ గారు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు చదువంటే మాకిష్టం కార్యక్రమం ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. చదువులోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రతి ఒ

మల్లేశ్వరుడి దర్శనం... మహా భాగ్యం

కంబదూరులో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభం

జిల్లాలో పురాతన శివాలయంగా పేరుగాంచిన కంబదూరు మల్లేశ్వర ఆలయం

బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న మల్లేశ్వర ఆలయం

గర్భాలయంలో మూలవిరాట్

బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలి రోజు గంగ పూజకు హాజరైన భక్తులు

కంబదూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త

అనంత జిల్లాలో పురాతన శివాలయంగా పేరుగాంచిన కంబదూరు మల్లేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధల మధ్య ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు ఆంధ్ర, కర్ణాటక ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివస్తుండటంతో ఆలయం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడ నుంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో దేవదాస్ , ధర్మకర్త గాజుల హనుమంతరాయుడు, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు .దర్శనం, ప్రసాద పంపిణీ, తాగునీరు, పారిశుధ్యం, భద్రత వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.8 నుంచి 16 వ తేదీ వరకు మల్లేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తొలిరోజు శివ పంచాక్షరి మంత్రం, గంగ పూజతో ప్రారంభమై 14 న శివపార్వతుల కళ్యాణం, గ్రామోత్సవం , 15 న మహాశివరాత్రి పురస్కరించుకొని మల్లేశ్వరుడికి ప్రత్యేక రుద్రాభిషేకం,16 గంగ పూజతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వెల్లడించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజూ మల్లే శ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అలంకార పూజలు నిర్వహించనున్నారు. మహాశివరాత్రి రోజున ప్రత్యేక కార్యక్రమాలతో పాటు రాత్రంతా జాగరణ కార్యక్రమాలు జరగనున్నాయి. గర్భాలయంలో ప్రతిష్ఠితమైన మహా శివలింగం, నంది విగ్రహం, ఏకశిల పద్మ కమలం, కోనేరు బావి, అలాగే అపూర్వమైన శిల్పకళా సంపద భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.చోళులు, కళ్యాణి చాళుక్యుల రాజులు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది.ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని దేవదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం - ఎమ్మెల్యే పరిటాల సునీత

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా తన వంతుగా సహాయ అందిస్తామని రాప్తాడు నియోజకవర్గం శాసనసభ్యురాలు పరిటాల సునీత తెలిపారు. ఆదివారం సాయంత్రం అనంతపురంలోని తన నివాసంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పలువురు నాయకులతో ఉద్యోగుల సమస్యల గురించి చర్చించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుటుంబ ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తున్నదని తెలిపారు. ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలన్నింటిని చెల్లించే విధంగా ఇప్పటికే ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయానికి స్థలం కేటాయింపు కొరకు కూడా సహకరిస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత హామీ ఇచ్చారు.

బాకీకి భూమిని కేటాయించండి : ఏపీజీఏ విజ్ఞప్తి అసెంబ్లీలో ఉద్యోగుల గళం వినిపించాలని రాప్తాడు శాసనసభ సభ్యురాలు సునీతమ్మకు కోరుతూ వినతి పత్రాన్ని సమర్పించారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ. 35 వేల కోట్ల బకాయిలను బడ్జెట్లో నిధులు కేటాయించాలని ఒకవేళ ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా నగదు రూపంలో చెల్లించలేని పక్షంలో, దానికి సరిపడా విలువ చేసే ఇంటి స్థలాలను, ఉద్యోగులకు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. ఈ నెల 11, 2026 నుండి ప్రారంభం కానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సంఘం నాయకులు ఎమ్మెల్యేలు కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన 4 పెండింగ్ డీఏలు, ఐఆర్, పీఆర్సీ, సీపీఎస్ రద్దు వంటి అంశాలపై రానున్న బడ్జెట్‌లో నిధులు కేటాయించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గోపికృష్ణ, జిల్లా కార్యదర్శి రాము నాయక్, రాష్ట్ర కార్యదర్శులు, హనుమంతు, మహిళా విభాగ రాష్ట్ర కార్యదర్శి సుజాత,, రాప్తాడు తాలూకా అధ్యక్షులు మారుతి ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే జిల్లా నాయకులు నాగేశ్వరయ్య, నాగరాజు, మోలా, భగీరథ రెడ్డి, నాగేష్, ఈశ్వరయ్య, శ్రీరాములు, శ్రీనివాసులు, ఫక్రుద్దీన్, నీల కంఠేశ్వర్, జాఫర్, గోవిందరెడ్డి నారాయణ, నాయక్ హాజరయ్యారు.

నాసిరకం వరి విత్తనాలు రైతులను నిండా ముంచాయి..

నకిలీనాసిరకం వరి విత్తనాలతో నష్టపోయామనిరైతుల ఆవేదన..వరిలో ఎదుగుదల లోపం - మూడు ఎకరాల్లో ఇదే పరిస్థితి

లబోదిబోమంటున్న బుడ్డయ్యదొడ్డి రైతులు -ఎరువుల దుకాణ యజమానులే మా నష్టానికి కారణం అని రైతులు ఆరోపణ

నష్టపోయిన వరి పంటను చూపుతున్న రైతులు

ప్రస్తుతం వరిపంట ఉన్న దృశ్యం

శెట్టూరు: ఫిబ్రవరి 08 ప్రభాతవార్త

నాసిరకం వరి విత్తనాలు అన్నదాతలను నిండాముంచాయి.మండల పరిధిలోని పెరుగుపాళ్యం పంచాయితీ బుడ్డయ్యదొడ్డిగ్రామంలో మూడు ఎకరాల్లో సాగు చేసిన వరిపంట ఎదుగుదలలోపించి వరికంకులు సక్రమంగా రాకపోవటం ఇతరత్రా సమస్యలు కనిపిస్తుండటంతో రైతులు ఎర్రప్ప, యర గుంటప్పగారి తిప్పేస్వామి,గోపాల్ లు లబోదిబో మంటున్నారు.వీరి మూడు ఎకరాల్లో వేసిన వరివిత్తనాలు కళ్యాణదుర్గం పట్టణ లో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల ఓ ఎరువుల దుకాణంలోగత అక్టోబర్ నెలలో వరి విత్తనాలను ఒక ప్యాకెట్950/రూపాయల చొప్పున ఆరుప్యా కెట్లను కొనుగోలు చేశారు.అంతే కాకుండా ఆ పంటకు కావలసిన ఎరువులు, మందులు మొత్తం ఆ ఎరువులదుకాణంలోనే విక్రయించారు. అక్టోబర్ మాసంలో నారుపోసి సాగుచేసిన వరిపంట ఆశాజనకంగా లేకపోవటంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఆ రైతులు సాగు చేసిన వరిపంట40శాతం చిగురు వచ్చి పంట చేతికివచ్చే లక్షణాలు కనిపిం చకపోగా దీంతో రైతులుఆందోళన చెందుతున్నారు.ఇప్పటికే పెట్టుబడికి సుమారుగా 1,50,000 రూపాయలు వ్యయచేసి తీరాచూసే సరికి పెట్టుబడి కూడా రాకపోవటంతో రైతులు కన్నీరు పెడుతున్నారు.నీరు సమృద్ధిగా ఉన్నప్పటికి ఆశించిన పంటను పండలేక పోయామని అన్నదాతలు ఆక్రదన వ్యక్తం చేశారు.

సంత్‌శ్రీసేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు విజయవంతం చేద్దాం

- వైఎస్ఆర్‌సిపి రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎన్ఆర్ఐ వింగ్ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి

వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

ఈ నెల 13, 14, 15 తేదీలలో పెద్ద ఎత్తున జరగనున్న సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేద్దామని వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో జిల్లా వైఎస్ఆర్‌సిపి ఎస్టీ సెల్ నాయకులు శ్రీనివాస్‌నాయక్, శివశంకర్‌నాయక్ అధ్యక్షతన వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి, యువనాయుడు ఆలూరు ఎరిస్వామిరెడ్డి, సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బంజారాల ఆరాధ్య దైవమైన సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు దేశ వ్యాప్తంగా ఉన్న బంజారా సోదరీ సోదరీ మనులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో వెంకటేష్‌నాయక్, సోమ్లానాయక్, ధనుంజయ్‌నాయక్, శీనానాయక్ తదితరులు పాల్గొన్నారు.

వామపక్ష ఉద్యమనేత వడ్డే శ్రీరాములు300మందితో మంత్రి సమక్షంలో టిడిపిలో చేరిక

కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం చూసి టిడిపిలోకి చేరుతున్నాం . పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించిన మంత్రి సవిత

మంత్రి సమక్షంలో టిడిపిలో చేరుతున్న సిపిఐ నేత వడ్డే శ్రీరాములు

టిడిపిలో చేరుతున్న300 మందికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న మంత్రి

పెనుకొండ ఫిబ్రవరి 8 (ప్రభాతవార్త)

వామపక్ష ఉద్యమ నేత పెనుకొండ నియోజకవర్గం సిపిఐ సీనియర్ నాయకులు కొండంపల్లి శ్రీరాములు, ఏఐటీయూసీ నాయకులు క్రిష్టప్ప, వెంకటరాముడు, నరసింహమూర్తి,వెంకటేష్, జాఫర్, అల్లాబకాష్, వెంకటలక్ష్మమ్మలతో పాటు మరో 300 కుటుంబాలు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలోకి చేరుతున్నారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. ఆదివారం పట్టణంలోని నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత,జౌళి శాఖల మంత్రి సవిత సమక్షంలో వామపక్ష నేత నియోజకవర్గం సిపిఐ నాయకులు శ్రీరాములు ఆధ్వర్యంలో వామపక్ష పార్టీల కు చెందిన 300 మంది మంత్రి సవిత సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.వారందరికీ మంత్రి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేవలం18 నెలల్లోనే రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో వేగంగా ముందుకు సాగుతోందన్నారు.ఎన్నడూ లేని విధంగా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, ప్రతి వర్గాన్ని ఆదుకునే విధంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.ఈ సందర్భంగా పార్టీలోకి చేరిన వారు మాట్లాడుతూ పెనుకొండ నియోజకవర్గంలో మోలిక వసతులు, రహదారులు, తాగునీరు, విద్య,వైద్య రంగాల్లో అభివృద్ధి పరుగులు పెడుతున్నాయని వాటికి ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరుతున్నామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మంత్రి సవితమ్మ సారథ్యంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని,కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా అనుకూల పాలనకు నిదర్శనంగానే వివిధ పార్టీల నుంచి పెద్ద ఎత్తున నాయకులు,కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలోకి చేరుతున్నామని తెలిపారు. పార్టీలో చేరిన శ్రీరాములు మాట్లాడుతూ మంత్రి సవిత గతంలో మేము పేదల ప్రజల పక్షాన చేపట్టిన అనేక ఉద్యమాలకు సహకారం అందించారని, మంత్రి పేద ప్రజలకు న్యాయం చేస్తుందని నమ్మకంతో పార్టీలో చేరుతున్నామని,మా నమ్మకాన్ని వమ్ము చేయరని భావిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా పెనుకొండ లోని సిపిఐ కాలనీలో నెలకొన్న పేదల సమస్యలు అయినటు వంటి ఇంటి పట్టాలు,ఇల్లు మంజూరు, కరెంటు, త్రాగునీరు సమస్యను పరిష్కరిస్తారని ఆశిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత భర్త సీనియర్ టిడిపి నాయకులు వెంకటేశ్వరరావు,రాష్ట్ర ఉప్పర సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకట రమణ,శ్రీసత్య సాయి జిల్లా టిడిపి మాజీ అధ్యక్షులు కొల్లకుంట అంజనప్ప,రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి ఆంజనేయులు, స్వచ్ఛంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ రెడ్డి వారి మంజునాథ్, జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి హనుమయ్య, పెనుకొండ అర్బన్ టిడిపి కన్వీనర్ శ్రీరాములు, సింగల్ విండో చైర్ పర్సన్ పోతి రెడ్డి,టిడిపి నాయకులు త్రివేంద్ర, బాబుల్ రెడ్డి,కురుబవండ్లపల్లి మాజీ సర్పంచ్ సోమశేఖర్, వెంకటగిరిపాలెం మాజీ వైస్ సర్పంచ్ వడ్డే శ్రీని వాసులు, మరువపల్లి మాజీ సర్పంచ్ నరసింహులు, నియోజకవర్గ టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లి సల్లంగా చూడమ్మ...!

- వైభవంగా ఏటి గంగమ్మతల్లి తిరునాళ్ళు - జన సంద్రమైన పెన్నానదీ పరివాహక ప్రాంతం - పుణ్యస్నానాలు ఆచరించి పూజలు జరిపిన భక్తులు - అక్కడే కోళ్లు, పొట్టేళ్లుకోసి వండుకొని వనభోజనాలు

గంగమ్మతల్లి ఆలయంవద్ద భక్తుల సందడి

ప్రత్యేకాలంకరణలో గంగమ్మతల్లి మూలవిరాట్

పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

గంగమ్మతల్లి పల్లకీ ఉత్సవం దృశ్యం

ఉరవకొండ, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

ఉరవకొండ మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెన్నహోబిళం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సమీపంలోగల అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారిలోని భారీ వంతెన క్రింద ప్రవహించే పెన్నానది పరివాహక ప్రాంతంలో వెలసిన ఏటి గంగమ్మ తల్లి తిరునాళ్ళు స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం మాఘ మాసం సప్తమి 3వ ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం నుంచి అభిషేకాలు, పూజలు నిర్వహించి అమ్మవారి పల్లకీ ఉత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని అశ్వర్థనారాయణ కట్టవద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుమునుపు పెన్నానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు గంగమ్మ తల్లికి వాయినాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అన్ని నదుల్లోకెల్లా పెన్నానది ఎంతో పవిత్రమైనదని, మాఘమాసంలో ఈనదిలో పుష్కరుడు వుంటాడన్న నమ్మకంతో ఇక్కడ స్నానాలు చేసి మొక్కులు తీర్చుకోవడం అనాధిగా వస్తోంది. కాగా వివిధ ప్రాంతాల నుండి తిరునాళ్ళకు తరలివచ్చిన భక్తులు నది ఒడ్డున గొర్రెలు మేకలు, పొట్టేలు, కోళ్లను కోసి పాత ఐరన్ బిడ్జీ, నూతన సిమెంట్ బిడ్జీ క్రింద వండుకొని వన భోజనాలు సాగించారు. కోర్కెలు తీరినవారు అమ్మవారికి తలనీలాలు సైతం సమర్పించారు. ఈ ప్రాంతంలో ఆట వస్తువులు, మిఠాయిల దుఖానాలు, చెరుకుగడల విక్రయాల దుకాణాలు వెలియగా కొనుగోలుదారులతో కిటకిట లాడాయి. గంగమ్మతల్లి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు పెన్న హోబి ళానికి చేరుకొని లక్ష్మీనరసింహస్వామి, ఉద్భవలక్ష్మి అమ్మవారి ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, యువనేత వై.భీమరెడ్డి ఆధ్వర్యంలో ఉరవకొండ పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకుకూరల నాగరాజు, వార్డు సభ్యురాలు వనజ దంపతులు తిరునాళ్లలో భక్తులకు ఉదయం ఫలహారం, మధ్యాన్నం అన్నదానం నిర్వహించారు. తిరునాళ్ళలో ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు జరుగకుండా ఉరవకొండ సీఐ బి.మహానంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇళ్ల పట్టాలు ఇస్తాం

- గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు వలనే ఇళ్ల నిర్మాణం ఆలస్యమవుతోంది - ఇళ్ల పట్టాల పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత - బుక్కచెర్ల గ్రామానికి చెందిన వారికి ఇళ్ల పట్టాలు అందజేసిన ఎమ్మెల్యే

ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాప్తాడు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా ఇళ్ల పట్టాలు అందజేస్తామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు మండలం బుక్కచర్ల గ్రామానికి చెందిన వారికి ఆమె అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఇళ్ల పట్టాలు అందజేశారు. మొత్తం 8మంది నిరుపేదలకి ఒక్కొక్కరికి 2సెంట్లు ప్రకారం ఇంటి స్థలాలు కేటాయించి పట్టాలు పంపిణీ చేశారు. లబ్ధిదారులు ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలు వలనే ఇళ్ల పట్టాల పంపిణీ, ఇళ్ల నిర్మాణం ఆలస్య మవుతోందని అన్నారు. ఇప్పటికే గ్రామాల వారిగా ఇళ్ల పట్టాలు అందజేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. త్వరలోనే పట్టాల పంపిణీ, ఇళ్ల నిర్మాణం ప్రారంభ మవుతుం దన్నారు. కేవలం అర్హత ఉంటే చాలని.. పార్టీలు ఈ ప్రభుత్వం చూడదని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ...

న- 19 మంది లబ్ధిదారులకు 19, 50, 801 రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు

లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు

మడకశిర టౌన్ ఫిబ్రవరి 8 ప్రభాతవార్త.

సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే క్యాంపులో ఆదివారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు 19 మంది లబ్ధిదారులకు 19,50, 801 వేల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిటిడి బోర్డు మెంబర్, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ: వైద్య పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పార్టీలకతీతంగా కేవలం అర్హతే ప్రామాణికంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారన్నారు. 19 మంది లబ్ధిదారులకు లక్షల 19, 50, 801 వేల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు. చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ :వైద్య సహాయం కోసం ముఖ్యమంత్రి చంద్ర బాబు మంజూరు చేసిన నిధులు తమకు అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు కి కృత జ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర వక్కలిగ చైర్మన్ లక్ష్మీ నారాయణ. నాయకులు. లబ్ధిదారులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు మండలం అశ్వర్థ నారాయణ స్వామి తిరునాళ్లలో పటిష్ట బందోబస్తు

- జిల్లా ఎస్పీ పి.జగదీష్

- జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఎలాంటి ఘటనలకు తావు లేకుండా గట్టి చర్యలు

- విరివిగా సాంకేతికత వినియోగం... డ్రోన్లు ద్వారా ప్రత్యేక నిఘా

పెద్దపప్పూరు మండలం అశ్వర్థ నారాయణ స్వామి తిరునాళ్ల దృశ్యాలు

అనంతపురం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త బ్యూరో

పెద్దపప్పూరు మండలం చిన్నపప్పూరు గ్రామంలో వెలసిన అశ్వర్థ నారాయణ స్వామి దేవాలయం వద్ద జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి సూచనల మేరకు పెద్దవడగూరు సి.ఐ రామసుబ్బయ్య ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టారు.

మాఘ మాసం పురస్కరించుకుని మూడవ ఆదివారం కావడంతో జిల్లా నుండే కాకుండా ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుండి భక్తులు అధికంగా తరలి వచ్చారు. భక్తుల తాకిడికి అనుగుణంగానే పోలీసులు చర్యలు తీసుకున్నారు. బ్యారికేడ్లతో కల్గిన క్యూలైన్లు నిర్వహించారు. తోపులాటలు లేకుండా సాఫీగా దర్శన భాగ్యం కలిగేలా విధులు నిర్వర్తించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా తగిన పోలీసు సిబ్బంది బందోబస్తు విధులు చేపట్టారు. అశ్వర్థ నారాయణ స్వామి దేవాలయం, పరిసరాలలో డ్రోన్లు ఎగురవేసి నిఘా వేసి భక్తులకు భద్రత కల్పించారు. అంతేకాకుండా దొంగతనాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలలో భాగంగా క్రైం బృందాలచే గట్టి నిఘా ఏర్పాటు చేశారు.

వైభవంగా కాలభైరవ విగ్రహ ప్రతిష్టాపన పూజల్లో ఎంపీ అంబిక కుటుంబ సభ్యులు

హిందూపురం ఫిబ్రవరి 08 ప్రభాతవార్త

హిందూపురం పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో వెలసిన శ్రీ నంజుండేశ్వర, షిరిడి సాయిబాబా ఆలయ ప్రాంగణంలో ఆదివారం కాలభైరవ స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, హోమాలు మరియు విశేష పూజా కార్యక్రమాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. శాస్త్రోక్తంగా గణపతి పూజతో ప్రారంభించి, పుణ్యాహవాచనం, జలాధివాసం, ధాన్యాధివాసం వంటి క్రతువుల అనంతరం కాలభైరవ స్వామి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ పూజా కార్యక్రమాల్లో అనంతపురం పార్లమెంట్ సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ దంపతులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చెరువు మట్టి ఎంచక్క కర్ణాటకకు

- అదే కర్ణాటక ప్రాంతంలో దోసెడు మట్టి.. దోసెడు ఇసుకను తవ్వితే జైలుకే..!

అగళి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

రైతులు తమ పొలాలను సారవంతంగా చేసుకోవడానికి మంచి దిగుబడిని సాధించడానికి చెరువు మట్టిని పొలాలకు వక్క, కొబ్బరి తోటలకు, పండ్ల తోటలకు తోలుతూ ఉంటారు. కానీ అందుకు భిన్నంగా ఇరిగేపల్లి చెరువు నుంచి మంచి ఎర్రమట్టిని చెరువులో తవ్వి కర్ణాటక రాష్ట్ర గ్రామాలైన కార్పేపల్లి, బసవనపల్లి, ఒసహళ్లి, చిత్త అగళి ఇలా తదితర గ్రామాలకు మట్టిని తరలిస్తూ తమ ప్రాంత రైతులకు అన్యాయం చేస్తున్నారని రైతులు లబోదిబోమంటున్నారు. అగళి మండలంలో ప్రవహించే సువర్ణ ముఖి నది నుంచి ఇసుకను తవ్వి కర్ణాటక రాష్ట్రం శిర, తుమకూరు, బెంగుళూరుకు తరలించి సొమ్ముచేసుకున్న దాఖలాలు కోకొల్లలుగా ఉన్నాయి.

దశాబ్ద కాలంగా సువర్ణ ముఖి నది నుంచి వచ్చిన ఇసుకను ఇతర ప్రాంతాలకు అమ్మి సొమ్ముచేసుకున్నారు. పదుల సంఖ్యలో స్వార్థపరులు పేదలు ఇల్లు నిర్మించుకోవడానికి వాడుకోవాల్సిన ఇసుకను ఇతర ప్రాంతాలకు తోలి సొమ్ముచేసుకున్నారు. ఇసుకను తవ్వడం మూలంగా భూగర్భ జలాలు అడుగంటి వేలాది వక్క, కొబ్బ చెట్లు ఎండిపోయాయి. వేలాది బోర్లు బావులు నీళ్లు లేక బీటలు వారాయి. గత మూడేళ్లలో ఒక మోస్తారు వర్షం మండలంలో కురవడం, 30 ఏళ్ల తర్వాత అగళి చెరువు గత మూడేళ్లలో నిండటంతో రైతులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల కోసం ఇసుకను ఉచితంగా తీసుకోవాలని అవకాశం కల్పించింది. దీనిని అదు నుగా చేసుకుని కొందరు స్వార్థపరులు ఇసుకను కర్ణాటక రాష్ట్ర గ్రామాలకు తరలించి సొమ్ము చేసుకున్నారు. ఒక పక్క ఇసుక మరో పక్క ప్రస్తుతం ఇరిగేపల్లి చెరువు నుంచి మంచి మట్టిని కర్ణాటక ప్రాంతాలకు తరలిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటక ప్రాంతా